ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడే పోలింగ్ ప్రక్రియ
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

తాళ్లరేవు: ఎన్నికల వేడి రాజుకుంది.. పలు పంచాయతీల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆయా ప్రాంతాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఉప ఎన్నిక శనివారం జరుగనుంది. ఇందులో భాగంగా జార్జిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. ఇక్కడి సర్పంచ్ కోలా సత్యదేవి ఆకస్మిక మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించే పోలింగ్, కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం 2 గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. పంచాయతీ పరిధిలో మొత్తం 3,494 మంది ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 1,769, మహిళా ఓటర్లు 1,725 మంది. 14 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహిస్తుండగా, 80 మంది సిబ్బంది, 84 మంది పోలీసుల పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరుగుతుందని ఎంపీడీఓ వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్, మరో అదర్ పోలింగ్ ఆఫీసర్ ఉంటారన్నారు. ఈ పంచాయతీలో స్టేజ్-2 ఆఫీసర్, రిటర్నింగ్ అధికారి విద్యాసాగర్ కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వరలక్ష్మి ఆయా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని అనుపమ తెలిపారు. సర్పంచ్ స్థానానికి ముగ్గురు మహిళలు పోటీ పడుతున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో రెడ్డి భాగ్యలక్ష్మి, టీడీపీ-జనసేన మద్దతుతో గుత్తుల సత్యవేణి, స్వతంత్ర అభ్యర్థిగా కానూరి సూర్యావతి పోటీలో ఉన్నారు. ప్రధాన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించడంతో ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.


జార్జిపేటలో ఎన్నికల విధులపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్సై శ్రీనివాసకుమార్

టి.కొత్తపల్లిలో..

ఐ.పోలవరం: టి.కొత్తపల్లిలో మూడో వార్డు స్థానానికి శనివారం ఉప ఎన్నిక జరుగనుంది. దీనికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వార్డు స్థానానికి గుత్తాల జ్యోతి, సవరపు వెంకటరమణలు పోటీలో ఉన్నారు. మొత్తం 425 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 59వ పోలింగ్ బూత్‌లో పోలింగ్ జరుగుతుందని ఎంపీడీఓ డి.రాంబాబు, తహసీల్దార్ ఝూన్సీకుమారి తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పోలింగ్ జరుగనుంది.

క్లుప్తంగా

వైభవంగా గనికమ్మ ఆలయ వార్షికోత్సవం


గనికమ్మకు పూజలు చేస్తున్న డాక్టర్ రంగారావు దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దు వారి వీధిలో ఉన్న శ్రీగణపతి, గనికమ్మ వారి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. డాక్టర్ గొలకోటి రంగారావు దంపతులు కర్తలుగా అమ్మవారికి పలు పూజలు, హోమాలు చేశారు. బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో మూలమంత్ర శాంతి హోమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. శ్రీగనికమ్మ వారి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు సేవలు అందించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధనకు వేలాది మంది తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, పెద్దలు వంటెద్దు నాగేశ్వరరావు, ఆకుల నాగేశ్వరరావు, ముచ్చెర్ల బాబి, అన్నవరపు ఈశ్వరరావు, వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్‌కు ఘన నివాళి


కామనగరువులో సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని కోనసీమ గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కామనగరువులోని గౌడ కల్యాణ మండపంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం కామనగరువు సెంటర్‌లో బాణసంచా కాల్చారు. కోనసీమ గౌడ సంఘ అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు) మాట్లాడారు. సంఘ ఉపాధ్యక్షుడు మట్టా సత్తిబాబు, గౌడ జిల్లా నాయకులు నిచ్చినకోళ్ల సుదర్శనరావు, దాసరి చిన్న, బొర్ర రమేష్, రాజులపూడి మురళి, వంకా శ్రీనివాసరావు, దాసరి వాసు, రాజులపూడి సత్యనారాయణ, కామన గంగాధరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం


తహసీల్దార్‌ను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

ఉప్పలగుప్తం: ఇటీవల రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జోగి రమేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా పురస్కారం అందుకున్న తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరిని మండలానికి చెందిన పలువురు నాయకులు సత్కరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు, నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

టీచర్ అసభ్య ప్రవర్తనపై కేసు

కొత్తపేట: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్‌పై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఏఎస్సై డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న ఆర్‌వీ సత్యనారాయణ ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గత నెల 17న హెడ్ మాస్టర్ యాళ్ల చంద్రశేఖర్‌కు విద్యార్థినులు తెలిపారు. దీనిపై హెచ్ఎం మహిళా టీచర్లతో ఆ విద్యార్థినులను ఆరా తీయగా తాకకూడని చోట తాకినట్లు, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. సదరు సత్యనారాయణను వివరణ కోరగా అటువంటి పని చేయలేదని, ప్రవర్తన మార్చుకుంటానని లిఖితపూర్వకంగా రాసిచ్చాడు. ఇదిలా ఉండగా ఈనెల 7, 8, 9 తేదీల్లో పడాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సత్యనారాయణ అనే ఉపాధ్యాయుడు తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ట్రస్ట్ వారికి రాతపూర్వకంగా తెలిపారు. విద్యార్థులు చెప్పిన విషయాన్ని ఆ స్కూల్ హెచ్ఎంకి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బాధితుడికి చేయూత


సత్యవెంకటకృష్ణకు వీల్ చైర్, హైజనిక్ కిట్‌ను అందజేస్తున్న సత్యనారాయణ తదితరులు

ఐ.పోలవరం: స్థానికంగా విద్యుత్తు స్తంభం నుంచి పడి వెన్నెముక పనిచేయక మంచంపై నడవలేని స్థితిలో ఉన్న పులపకూర సత్య వెంకటకృష్ణకు రెడ్‌క్రాస్ సొసైటీ చేయూత అందించింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు వీల్ చైర్, హైజనిక్ కిట్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందజేసింది. సొసైటీ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ), వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, ఎంపీపీ మిరియం జ్యోతి, సొసైటీ అధ్యక్షులు విత్తనాల శ్రీనివాసరావు, సాధనాల బాబూరావు, రేవు యజ్ఞశ్రీ, దంగుడుబియ్యం వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్నా

తాళ్లరేవు: స్థానిక సామాజిక ఆస్పత్రి వైద్యురాలు స్నేహలత ఆశ కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. తాళ్లరేవులోని సామాజిక ఆస్పత్రి వద్ద ఈ ఆందోళన జరిగింది. ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమల్ల పద్మ మాట్లాడుతూ గౌరవప్రదమైన వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్ స్నేహలత ఆశ కార్యకర్తలను కులం పేరుతో అవమానించి దుర్భాషలాడటం సరికాదన్నారు. తన కులం వారికి మాత్రమే వైద్య సేవలు అందిస్తాననడం దారుణమన్నారు. సీపీఎం నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, ఆశా కార్యకర్తల సంఘ మండల నాయకురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు విశేష సేవలందిస్తున్న ఆశలను అవమానించడం సరైన పద్ధతి కాదన్నారు. ఆశ కార్యకర్తలతో స్థానిక నాయకులు, వైద్యులు చర్చలు జరిపారు. ఆశలపై పొరపాటున అలా మాట్లాడానని, ఇటువంటి పరిస్థితి మరోసారి రాకుండా చూస్తానని డాక్టర్ కోరడంతో ఆశ వర్కర్లు శాంతించారు. ఈ చర్చల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీష, వైద్యుడు అరవింద్, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ ఎ.లక్ష్మీనారాయణ, నాయకులు పొన్నాడ భైరవమూర్తి, గంజా సూరిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


తాళ్లరేవులో ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం

- మంత్రి పినిపే విశ్వరూప్
- చల్లపల్లిలో గడప గడపకూ..

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి జగ్గిరాజుపేటలో ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి ఆధ్వర్యంలో మంత్రి తనయుడు శ్రీకాంత్‌తో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ తిరిగి సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలు గుర్తించిన వారికే పథకాలు అందేవని, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుల, మత, పార్టీ, ప్రాంతీయ బేధాలు చూడకుండా అర్హులందరికీ పథకాలు దరిచేరాయన్నారు. తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను చేయాలని ఆయన కోరారు. ఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు వరసాల వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, భోగిశెట్టి నరసింగ్, చీకురుమెల్లి సత్యనారాయణ, బడుగు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.


చల్లపల్లిలో లబ్ధిదారునికి పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

పుష్కలంగా తాగునీరు అందిస్తాం

మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ పుష్కలంగా తాగునీరు అందించేందుకు కార్యాచరణ చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం కామనగరువులోని నల్లా సత్యనారాయణ లేఅవుట్‌లో వేదాంత సీఎస్ఆర్ నిధులు రూ 38.50 లక్షలతో వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ నిధులతో ఓహెచ్ఆర్‌ల నిర్మాణం, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చమురు సంస్థ నిధులతోనూ ప్రజలకు తాగునీరు అందించేందుకు పలు పనులు చేస్తున్నట్లు ఆయన వివరించారు. మండల సర్పంచుల సమైఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రాంగోపాల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపీటీసీ మెండు గంగా భవాని, సర్పంచులు చెల్లుబోయిన నాని, గంగుమళ్ల ఏసుబాబు, రాజులపూడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కామనగరువులో ట్యాంక్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్

యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని కోరంగి పంచాయతీ సుబ్బారాయుని దిమ్మ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుంకరపాలెం యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు గాయాలైనట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కథనం ప్రకారం.. కాకినాడ రమణయ్యపేటకు చెందిన జి.గౌతంతేజ్ సుంకరపాలెం యూనియన్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన రోజూ లాగే బైక్‌పై విధులకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌతం తేజ్ కుడి కాలు విరిగిపోయింది. స్థానికులు హుటాహుటిన కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

ముమ్మిడివరం: రైతులకు వ్యక్తిగతంగా రాయితీపై వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం తీర్మానించింది. శుక్రవారం ముమ్మిడివరంలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీఏఓ బోసుబాబు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. గత నెల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుపై సమావేశంలో చర్చించారు. రాజోలు నియోజకవర్గంలో శంకరగుప్తం డ్రైన్ వల్ల సుమారు లక్షపైనే కొబ్బరి మొక్కలు చనిపోయాయని, దీనిపై ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని పలువురు సభ్యులు తెలిపారు. దీనిపై ఆయా శాఖల సమన్వయంతో కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర నివేదిక తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. వరి చేలు ముంపు బారిన పడకుండా మురుగునీటి కాలువలో పూడికలు తొలగించాలని కోరారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ ఖరీఫ్ వరి చేలలో రెండు దఫాలు మాత్రమే యూరియా వేసుకోవాలని, మొదటి దఫా ఊడ్పులు, రెండో దఫా పొట్ట దశలో వేసుకోవాలన్నారు. నత్రజని ఎక్కువగా వేస్తే ఎండు తెగులు వస్తుందని అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రమేష్, వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం శ్యామ్, ఏరువాక శాస్త్రవేత్తలు, ఇరిగేషన్ ఈఈ, డీఈలు, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పథకాలు అందించండి

మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: నియోజకవర్గంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సూచించారు. శుక్రవారం భట్నవిల్లి గ్రామంలో మంత్రి నివాసం వద్ద నియోజకవర్గంలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పౌర సేవలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. దీనిద్వారా 1.40 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 2.40 లక్షల వలంటీర్ల నియమకాలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్నాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు స్వచ్ఛందగా పార్టీ కోసం పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. వారికి ఎటువంటి గౌరవ వేతనం ఉండదన్నారు. వచ్చే వారికి బీమా చేసే యోచనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని మంత్రి తెలిపారు. ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో పేదలకు అనేక పథకాలు అందించి సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. గడప గడపకూ సంక్షేమ ఫలాలు అమలు చెయ్యాలన్న ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యిళ్ల శేషారావు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సంసాని నాని, బొంతు గోవిందశెట్టి, బద్రి బాబ్జి, కొనుకు బాబూజీ, మున్సిపల్ చైర్మన్ రెడ్డిసత్యనాగేంద్రమణి, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భరత్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

వైభవంగా మహాలక్ష్మి సామూహిక సాధన

అమలాపురం టౌన్: శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో విద్యారణ్య ప్రోక్త బీజమంత్ర సంపుటిత శ్రీసూక్త సహిత శ్రీమహాలక్ష్మి సామూహిక సాధన వైభవంగా జరిగింది. శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ సాధన పట్టణానికి చెందిన భూసారపు శ్రీనివాసరావు, నాగ విజయలలిత దంపతులచే సాగింది. అమ్మవారికి పలు రకాల పండ్లు తదితర తీపి పదార్థాలతో మహా నివేదన చేశారు. అక్షయ పాత్ర అధ్యక్షుడు పోతురాజు రామకృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సాధనలో లింగోలు శిరీష, పోతురాజు కనకదుర్గ, చాగంటి నందు, పంజా సంధ్య, తూము రూప, చిక్కం పార్వతి తదితరులు పాల్గొన్నారు.


మహాలక్ష్మికి సామూహిక సాధన చేస్తున్న మహిళలు

ఫ్రైడే.. డ్రైడే పట్ల నిర్లక్ష్యం వద్దు


ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అడిషినల్ డీఎంఅండ్‌హెచ్ఓ భరతలక్ష్మి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సక్రమంగా అమలు చేయాలని అడిషినల్ డీఎంఅండ్‌హెచ్ఓ సీహెచ్‌వీ భరతలక్ష్మి అన్నారు. అంబాజీపేటలో డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరతలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వాడకం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వాటి ద్వారా వచ్చే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, డెంగీ వాధ్యుల వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని వివరించాలన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, సీహెచ్‌వో బి.అప్పారావు, పీహెచ్ఎన్ రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

పి.గన్నవరం: పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు నాయుడు, దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని జి.పెదపూడి గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ దంగేటి అన్నవరం, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు, మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు కత్తుల విక్టర్‌బాబు, మానుకొండ నిర్మల, పెదకాపు తదితరులతో కలసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగారు. ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబాల వారీగా జగన్ పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. పార్టీ నాయకులు సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, ఈలి చంద్రరావు, పండు, అడ్డగళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


జి.పెదపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం అయినవిల్లి సచివాలయం-1లో 1, 2కు చెందిన గృహసారథులు బీమా నమోదు శిక్షణలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ లబ్ధి చేకూరుస్తారన్నారు. ఆయన చెప్పిన మాట చెప్పినట్లు చేయడంలో వెనుకడుగు వేయరన్నారు. గృహసారథులకు బీమా కల్పించి వారి కుటుంబానికి రక్షణగా నిలుస్తున్నారన్నారు. ఇంకా అనేక ప్రయోజనాలు అందిస్తారన్నారు. తొలుత ఎమ్మెల్యే చిట్టిబాబు అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చిన్నబాబు, గృహసారథుల కన్వీనర్ పులిదిండి ప్రభాకర్, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రోగికి రూ.12 వేల సాయం

సఖినేటిపల్లి: అంతర్వేది పల్లిపాలెంలో శుక్రవారం అనారోగ్యంతో ఉన్న చొప్పల ప్రభాకర్‌రావుకు వైద్య ఖర్చుల నిమిత్తం పలువురు దాతలు రూ.12 వేల సాయం పంపిణీ చేశారు. పై మొత్తాన్ని దాతలు లోకినీడి దుర్గాప్రసాద్, బొమ్మిడి దేవేంద్ర్‌రాజు, మానుపాటి సూరిబాబు కలసి సమకూర్చారు. దీనిని మాజీ సర్పంచ్ చొప్పల చిట్టిబాబు, బాధితుడికి అందజేశారు. మాజీ సర్పంచ్ నల్లి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు

ఆత్రేయపురం: గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నార్కెడ్‌మిల్లిలో రూ.1.80 కోట్లతో చేపట్టిన ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి రోడ్డు నిర్మాణంలో ఎక్కడా నాణ్యతలో రాజీ పడవద్దన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత ప్రజల నుంచి స్పందన రావాలని సూచించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూడా నిర్మాణానికి నోచుకోకుండా వదిలేసిన రోడ్డు పనులు నేడు ఈ ప్రభుత్వంలో చేపట్టామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అనేక రోడ్లను నిర్మించుకున్నామన్నారు. నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజలకు రూ.1000 కోట్లకు అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, ఎంపీటీసీ వెంకటరమణ, ఆర్అండ్‌బీ జేఈ మణికుమార్ తదితరులు ఉన్నారు.

మోరి పీహెచ్‌సీ సందర్శన


వైద్యులు, సిబ్బందితో సమావేశమైన జిల్లా వైద్యాధికారి దొర

సఖినేటిపల్లి: మోరి పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర సందర్శించారు. పీహెచ్‌సీలో పలు రికార్డులను, మందుల స్టాక్ లిస్టులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు, గర్భిణులకు, టీబీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారులు పూర్ణ చంద్రకుమార్, డాక్టర్ శామ్యూల్ ప్రణయ్, వైద్య సిబ్బందితో సమావేశంలో ఆయన సమీక్షించారు. అలాగే 24 గంటలూ అందుబాటులో ఉంచే పాముకాటు, కుక్కకాటు, ఇతర అత్యవసర మందులపై కూడా వైద్యులతో చర్చించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని కేశవదాసుపాలెంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆయన పరిశీలించారు.

వాలీబాల్ కిట్ల అందజేత

అలమూరు: మండలంలోని చెముడులంకలో విద్యార్థులకు వాలీబాల్ కిట్ల పంపిణీ జరిగింది. ఇటీవల స్థానిక ఎస్‌టీఎస్ఎన్ఎం హైస్కూల్ జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు.

అందులో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఆయన వాలీబాల్ కిట్లను అందజేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీని నిలుపుకున్న సర్పంచ్ తమ్మనను ఉపాధ్యాయ బృందం అభినందించింది.